## క్లుప్తంగా

### అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సమావేశం రేపు

పాడేరు రూరల్: పాడేరు జిల్లా కేంద్రంలోని జీఎస్‌యూ భవనంలో సోమవారం అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి అన్ని మండలాల బాధ్యులు, సభ్యులు విధిగా హాజరు కావాలని సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సింహాచలం, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టపుల్లి శ్రీనివాస పడాల్ ఓ ప్రకటనలో కోరారు.

### 26 నుంచి దుశ్చర్తి నూకాలమ్మతల్లి జాతర

అడ్డతీగల: దుశ్చర్తిలోని నూకాలమ్మ తల్లి జాతర ఈనెల 26 నుంచి ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వేకువజామున 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు జాగరణ కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30వ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ మహోత్సవాల్లో భాగంగా గరగ నృత్యాలు, శక్తి వేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

### ప్రమాదకర కల్వర్టు పరిశీలన


కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో కోతకు గురై, ప్రమాదకరంగా మారిన కల్వర్టును వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచ్ కిరసాని మిల్కి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనస కల్వర్టు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకులకు ఆటంకం ఏర్పడిందన్నారు. కల్వర్టు కింద భాగంలో రాళ్లు తేలిపోయి, పట్టుత్వం పూర్తిగా కోల్పోయి ఉందని, ఏ క్షణమైన కుంగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు దేవ, నీలకంఠం, బుద్ధు, తదితరులు పాల్గొన్నారు.

### జల సంరక్షణతోనే మానవాళి మనుగడ


నీటి సద్వినియోగంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీవో

చింతపల్లి: జల సంరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుషాదేవి అన్నారు. జల దినోత్సవం సందర్భంగా నవ నిర్మాణ సమితి సంస్థ గిరిజన గ్రామాల్లో తాగునీటి కోసం అమలు చేస్తున్న పథకాలు, వాటి సద్వినియోగానికి సంబంధించి నీటి పరిరక్షణ సూత్రాల పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, తాగునీటి సరఫరా విభాగం ఏఈఈ స్వర్ణలత, సర్పంచ్ పుష్పలత, నవ నిర్మాణ సమితి ప్రతినిధులు కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

**చౌడుపల్లిలో నీటికుంట ప్రారంభం**

జల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నీటి కుంటను ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. ఉపాధి పథకం ఏపీడీ సీతయ్య, ఏపీవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులతో ఉద్యాన పంటలకు ఊతం

రంపచోడవరం: ఉపాధి హామీ పథకంలో మంజూరు చేసిన ఫారం పాండ్‌ల ద్వారా గిరిజన రైతులకు ఉద్యాన పంటలకు సంవృద్ధిగా నీటి లభ్యం సాధ్యమవుతుందని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. మండలంలోని నడివీధిలో శనివారం ఉలుగుల వెంకటరెడ్డి అనే రైతు పొలంలో ఫారం ఫాండ్ పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన రైతులు తమకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు గూడెం రమణి, పీసా ఉపాధ్యక్షుడు గూడెం బుజ్జి, కారం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రాజవొమ్మంగి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


పనసలో ఫారం పాండ్ పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, తదితరులు


మట్లపాడులో ఫారం పాండు ప్రారంభిస్తున్న ఏపీడీ రాంబాబు, ఎంపీడీవో విజయ, సర్పంచ్ అచ్చియ్యమ్మ తదితరులు


రాజేంద్రపాలెంలో ఫారం పాండ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, తదితరులు


సూరంపాలెంలో ఫారం పాండ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి

# ఫారం పాండ్స్‌తో నీటి వనరుల పరిరక్షణ


చెరువువీధి గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్న ఏపీవో కొండబాబు


హుకుంపేటలో చెరువు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజుబాబు

**ఘనంగా ప్రపంచ జల దినోత్సవం**


ఈతలబందలో నీటి కుంటల పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ కాసులమ్మ తదితరులు


పాలవలసలో ఫారం పాండు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య, ఉపాధి సిబ్బంది, తదితరులు

అడ్డతీగల: ఫారం పాండ్స్ నిర్మాణంతో నీటి వనరుల పరిరక్షణ జరుగుతుందని ఉపాధి హామీ అడ్డతీగల క్లస్టర్ ఏపీడీ ఎల్.రాంబాబు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలం మట్లపాడులో నిర్మించిన ఫారం పాండ్‌ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏడు మండలాల్లో అత్యధికంగా అడ్డతీగల మండలంలో ఇప్పటికే 126 ఫారం పాండ్లను నిర్మించామన్నారు. మండలానికి 550 ఫారం పాండ్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి రైతు భూమిలోనూ ఫారం పాండ్లు తవ్వుకోవడం వల్ల ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. ఉద్యాన పంటలకు నీటి కొరత లేకుండా ఉండడంతో పాటు భూగర్భ జలాలు ఇంకిపోకుండా ఉంటాయన్నారు. ఉపాధి కూలీలను, రైతులను భాగస్వాములను చేసి ప్రభుత్వ లక్ష్యం మేరకు ఫలితాలు సాధిస్తున్నట్లు ఎంపీడీవో కె.ఆర్.విజయ అన్నారు. సోక్‌పిట్స్ 160 నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఏపీవో అరవాలు, సర్పంచ్ అచ్చియ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**నీటి వనరులను సంరక్షించాలి**

గూడెంకొత్తవీధి: భావితరాల కోసం నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గూడెం కొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. ఉపాధి పథకంలో వంచుల పంచాయతీ ఈతలబంద గ్రామంలో ఫారం పాండ్ నిర్మాణానికి ఆమె శనివారం భూమి పూజ చేశారు. వంచుల సర్పంచ్ కాసులమ్మ, ఉపసర్పంచ్ శ్రీధర్, ఏపీవో రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిప్రసాద్, రాజేష్, గంగరాజు, నరేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని చినార్కూరు పంచాయతీ పందరాజుపల్లి గ్రామంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఫారం పాండ్ పనులకు సర్పంచ్ సున్నం అభిరామ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చిచ్చడి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ సోడె శ్రీను పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్ పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాఘవయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్ నిర్మాణానికి శనివారం వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్లీ శంకుస్థాపన చేశారు. సుజనకోట పంచాయతీ తాలబుతోట సర్పంచ్ రమేష్, కర్రిముఖిపుట్టు పంచాయతీ మేరకచింత గ్రామంలో సర్పంచ్ పుల్‌మొత్తిలు కూడా ఫారం పాండ్స్ పనులు ప్రారంభించారు. మండలంలో 110 ఫారం పాండ్స్‌ను పూర్తి చేశామని, 48 ఫారం పాండ్స్ పనులు ప్రారంభించామని ఏపీవో సంఘం నాయుడు తెలిపారు.

కొయ్యూరు: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలో 33 పంచాయతీల్లో ఫారం పాండ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాజేంద్రపాలెంలో రైతులు తవ్విన ఫారం పాండ్లను ఉపాధి హామీ ఏపీవో అప్పలరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాల్లో రైతులు 10/10 లేదా 20/20 సైజులో ఫారం పాండ్లను తవ్వుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.సింహాచలం, వీఆర్‌పీ ప్రసాద్ పాల్గొన్నారు.

**సూరంపాలెంలో జలదినోత్సవం**

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం, తదితర గ్రామాల్లో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. సూరంపాలెంలో ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద తవ్విన ఫారం పాండ్‌ను ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి ప్రారంభించారు. ప్రతి ఒక్కరు భూగర్భ జలాలను పరిరక్షించుకొనేందుకు తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. ఎంపీటీసీలు గంగదుర్గ, పెద్దిరాజు, ఉపాధి టీఏ రామలక్ష్మి, ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు, ఉపాధి ఏపీవో రెడ్డిబాబు పాల్గొన్నారు. లాగరాయి గ్రామంలో జరిగిన జల దినోత్సవంలో కూడా ఎంపీపీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఫారం పాండ్ పనులు చేపట్టారు. వంతాల, భీరం పంచాయతీ కేంద్రాల్లో ఎంపీపీ కల్యాణి, ఏపీవో కొండబాబు, మండిభ, నుర్మతి పంచాయతీ చెరువువీధి గ్రామంలోను, పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉపాధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ కొండబాబు, పీసా కమిటీ కార్యదర్శి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**పాలవలసలో..**

పెదబయలు: వర్షపు నీరు భూమిలో ఇంకే విధంగా ఫారం పాండు పనులు చేపట్టనున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు తెలిపారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పెదబయలు మండలం అరడకోట పంచాయతీ పాలవలస గ్రామంలో ఫారం పాండు పనులకు వారు శంకుస్థాపన చేశారు. పెదబయలు మండలంలో 575 ఫారం పాండ్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 23 పంచాయతీల్లో ఒకటి చొప్పున మొత్తం 25 ఫారం పాండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 212 ఫారం పాండ్స్ నిర్మాణానికి అమమతి వచ్చిందని, మరో 350 పాండ్లకు అనుమతి రావాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో పెదప్పలనాయుడు, టీఏ రాజుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ కె.బాలన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో ఎన్ఆర్ఈజీఎస్ ఫారం పాండ్ నిధులతో చేపట్టిన చెరువు నిర్మాణ పనులకు ఎంపీపీ కూడా రాజుబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా ఆదాయం పొందడమే కాకుండా చెరువుల తవ్వకాలు చేపట్టి వ్యవసాయ అభివృద్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గం మహిళాధ్యక్షురాలు సమిడ వెంకటపూర్ణిమ, పార్టీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, పీసా కమిటీ కార్యదర్శి కాసుల గోవింద్, ఉపాధి సిబ్బంది రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బాకా ఈశ్వరి
- అధికారుల గైర్హాజరుపై చర్యలకు వినతి


మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి

డుంబ్రిగుడ: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బాకా ఈశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజాప్రతినిధులకు ఎందుకు ఆహ్వానించడం లేదని పాలకవర్గ సభ్యులు అధికారులను నిలదీశారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఆస్పత్రుల అభివృద్ధి కమిటీల ఏర్పాటుపై అధికారులు స్పష్టతనివ్వాలని ప్రజాప్రతినిధులు కోరారు. సికిల్ సెల్ కేసులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 2027 కల్లా నిర్మూలనకు కృషి చేస్తున్నామని వైద్యులు తెలిపారు. గ్రామాల్లో బీపీ, షుగర్, ఇతర వ్యాధుల పరీక్షకు అవసరమైన పరికరాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని, దీన్ని అధికారులు పెడచెవిన పెడితే సహించబోమని ఎంపీపీ హెచ్చరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లు మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వెలుగు ద్వారా తీసుకున్న రుణాలను నెలవారీగా చెల్లించే వాటికి బిల్లులు ఇవ్వకుండా ఆశాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని గసభ సర్పంచ్ సునిత నిలదీశారు. మండలంలోని కొంత మంది అధికార పార్టీ నాయకులు పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, దీన్ని నివారించాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, పి.లలీత, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి

వీఆర్‌పురం: ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా గిరిజన గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని ఏఎస్‌డీఎస్ సంస్థ ప్రతినిధులు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలకు కావల్సిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, పారిశుధ్యం, తదితర రంగాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆదివాసి అభివృద్ధి అధ్యయన సంస్థ పరిశీలన చేస్తోంది. 14 మండలాల్లో 82 గ్రామాల సర్వే బాధ్యతను ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. మారేడుమిల్లిలో రెండు గ్రామాలు, దేవీపట్నంలో 6 గ్రామాలు, గంగవరంలో 3 గ్రామాలు, రంపచోడవరంలో 16 గ్రామాలు, చింతూరులో 21 గ్రామాలు, కూనవరంలో 10 గ్రామాలు, వీఆర్‌పురంలో 5 గ్రామాలు, బుట్టయిగూడెంలో 6 గ్రామాలు, వేలేరుపాడులో 8 గ్రామాలు, కుకునూరులో ఒక గ్రామం, పోలవరంలో 4 గ్రామాలు, రాజవొమంగి ఒక గ్రామం, రౌతులపాడులో ఒక గ్రామం, చింతలపుడిలో ఒక గ్రామంలో మార్చి నెలాఖరుకు సర్వే పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం 82 గ్రామాలకు రూ.16.40 కోట్ల నిధులు ఏప్రిల్‌లో మంజూరు కానున్నట్టు చెప్పారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


భాదిపుట్టులో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ భాదిపుట్టు, మెట్టభాదిపుట్టు గ్రామాల్లో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 62 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరికి రక్త పరీక్షలు చేశారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, క్షయ, తదితర వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కిలగాడ వైద్య సిబ్బంది వెంకటేశ్వరమ్మ, త్రివేణి, ప్రసాద్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## పీఎం జన్‌మన్ గృహాల సర్వే గడువు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి త్రినాథ్

ముంచంగిపుట్టు: పీఎం జన్‌మన్ గృహాలకు అదనంగా పెంచిన డబ్బుల కోసం సర్వే గడువును ప్రభుత్వం పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ముంచంగిపుట్టులో శనివారం సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెట్వర్క్, సాంకేతిక సమస్యలతో సర్వే చేసే అధికారులు, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీఎం జన్‌మన్ గృహాల రెండో విడత బిల్లుల విడుదలలో జాప్యంతో గృహాల నిర్మాణం ఆలస్యం అవుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పీవీటీజీ, జనరల్ కేటగిరీల వారికి త్వరగా సర్వే పూర్తి చేసి బిల్లులు విడుదల చేయాలని, లేని పక్షంలో లబ్ధిదారులతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు లైకోన్, ఎం.ఎం.శ్రీను, నారాయణ, జీనబంధు, దేవన్న పాల్గొన్నారు.

## చిన్నారుల సంరక్షణ బాధ్యత అంగన్‌వాడీలదే..

**అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ**


ముంచంగిపుట్టులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో వరహాలమ్మ..


కొయ్యూరులో ఆటపాటలతో సందడి చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


జి.మాడుగులలో మనవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను జాగ్రత్తగా సంరక్షించే బాధ్యత కార్యకర్తలపై ఉందని సీడీపీవో వరహాలమ్మ అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రీ స్కూల్, పోషణ బీ-పడాయి బీ కార్యక్రమంపై 99 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్య స్థితిగతుల మెరుగు, రక్తహీనత అధిగమించడం, పోషకాహారాన్ని ఏవిధంగా అందించాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, శిక్షణ ఇచ్చే అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న విషయాలతో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు సామర్థ్యాల పెంపుపై కొయ్యూరులో జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులను ఆకర్షించేందుకు వీలుగా బోధన చేయాలన్నారు. ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్య బాధ్యతలను అంగన్‌వాడీలకు అప్పగించిందని చెప్పారు. సామర్థ్యాలు మెరుగుపరుచుకుంటేనే బోధన చేయడం సులభతరంగా ఉంటుందన్నారు.

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కార్యకర్తలకు గూడెంకొత్తవీధిలో మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. మండలంలోని సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ ఇచ్చినట్టు సీడీపీవో లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, రామలక్ష్మి, మోహిని, కృష్ణకుమారి పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలు, శారీరక అభివృద్ధి పట్ల కార్యకర్తలు శ్రద్ధ వహించాలని సీడీపీవో .సువర్ణమ్మ సూచించారు. మండలంలోని 95 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలకు ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సూపర్‌వైజర్లు నిర్వహించిన పోషణ భీ, పడాయి బీ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పలు నినాదాలతో మనవహారం చేపట్టారు. పుట్టినప్పటి నుంచి మూడు సంవత్సరాల చిన్నారి వరకు అందించే శారీరక, మాసికక అభివృద్ధికి సంబంధించిన అంశాల గురించి వివరించారు. ఆరు సంవత్సరాలు ప్రీస్కూల్ కార్యక్రమాలు, శారీరక అభివృద్ధి, గ్రోత్ మానిటరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.సత్యసుజాత, ఎస్.విజయలక్ష్మి, ఎస్.సత్యవతి, డి.పద్మావతి, ఎం.లక్ష్మి, ఎల్.మణికుమారి, ఎ.కొండమ్మ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


చీమలపాడులో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ధర్మన్నపడాల్

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగేని ధర్మన్నపడాల్ తెలిపారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ చీమలపాడు గ్రామంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి, సాగునీటి సమస్య ఉందని, రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, రోడ్లు లేక అంబులెన్సు కూడా రావడంతో లేదని ప్రజలు ఏకరవు పెట్టారు. వర్షాకాలంలో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే డోలీ మోతలతో కులపాడులోని సబ్ సెంటర్‌కు తరలించే దౌర్భాగ్య పరిస్థితి ఇప్పటికీ ఉందంటే ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థమవుతుందని ధర్మన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ కింద మంచినీటి పథకం మంజూరైందని, పని చేయకుండా పైపులు వేసి వదిలేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చీమలపాడులో రోడ్డు పనులు చేపట్టాలని, గ్రావిటీ పనులు చేయించి గిరిజనులకు కూలీ సొమ్ము ఎగవేసిన కాంట్రాక్టర్ నాగేశ్వరరావుపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చెక్‌డామ్ నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దబ్బాయి, వార్డు నెంబర్ తిరుపతమ్మ, గ్రామ పెద్దలు కొండబాబు, మజ్జి ఆశీర్వాదం, అంగు పెద్దబబ్బాయి, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఐదు గ్రామాల్లో తాగునీటి పథకాలు ప్రారంభం


పోకలపాలెంలో పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ, సంస్థ ప్రతినిధులు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బొడ్డుమామిడి, పోకలపాలెం, అన్నవరం, గొర్రెలమెట్ట, దడవగొయ్యిలో విశాఖ నవ నిర్మాణ సమితి ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలను సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ శనివారం ప్రారంభించారు. నవ నిర్మాణ సమితి గిరిజనుల కోసం తాగునీటి పథకాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని సర్పంచ్ అన్నారు. మరిన్ని గ్రామాల్లో సంస్థ సేవలు అందించాలని ఆమె కోరారు. సంస్థ బీఎం ఎం.వీరనాయుడు, కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ వంతల కుమారి, ఇంజినీర్ కె.బుజ్జి, నాయకులు నారాయణ, తిరుపతి, కె.కొండబాబు పాల్గొన్నారు.

ఉసరికపాడులో.. : డొనూరు పంచాయతీ ఉసిరికపాడులో నవ నిర్మాణ సమితి ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని సర్పంచ్ పాట్టిక భవానీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాట్టిక పోతురాజు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### దాశరథిశర్మ సతీమణికి ఘన సన్మానం


దాశరథిశర్మ సతీమణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: మోదకొండమ్మతల్లి ఆలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన అప్పటి పాడేరు తహసీల్దార్, దివంగత దాశరథిశర్మ సతీమణి, ఇతర కుటుంబ సభ్యులను శనివారం ఘనంగా సన్మానించారు. 20 ఏళ్ల తరువాత పాడేరులోని మోదమ్మ ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ కమిటీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఇతర కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆమె మోదమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు దుశ్శాలువా కప్పి, మోదమ్మ చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు పలాసి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి కొణతాల ప్రశాంత్, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.